# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

ఆదివారం 11 అక్టోబర్ 2026






## ఆగని ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు..

అన్నదాతలకు తప్పని ఇక్కట్లు!

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగతనాలు

16లో



పాలనను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత

## కేసీఆర్‌దే

- పెద్దపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం చారిత్రక నిర్ణయం
- జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

4లో

## కరీంనగర్‌లో బీజేపీ బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్

- రెండు పార్టీలు నాటకాలతో మభ్యపెడుతున్నాయని విమర్శ
- సుడా మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ధ్వజం



5లో

# బతుకమ్మ సంబరం



వివరాలు 2లో..

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ**

- బతుకమ్మ వేడుకలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు
- బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- భగత్‌నగర్‌లో సంబరాల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ దంపతులు





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయాలు, కాలనీలు, గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.

## ఉపాధి హామీ కల్పనలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్

ఉత్తమ పనితీరుపై రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన

- శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్
- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ




3లో

## బైక్ రేసింగ్ బరితెగింపు!

వెనుక నుంచి ఎక్సెల్ కు ఢీ.. ఆపై ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన రేసింగ్ బైక్!



17లో

- రోడ్లపై వేగానికి అడ్డుకట్ట వేసేదెవరు?
- బైక్‌లతో విన్యాసాలు చేస్తూ రహదారులపై హల్‌చల్..
- ఇద్దరికి గాయాలు.. మైనర్ల ప్రమాదకర డ్రైవింగ్‌తో ప్రజల్లో ఆందోళన..

# బతుకమ్మ సంబురం

## ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ







- బతుకమ్మ వేడుకలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు
- బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- భగత్‌నగర్‌లో సంబరాల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ దంపతులు



**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆలయాలు, కాలనీలు, గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.**

కరీంనగర్ బ్యూరో,అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):

### శ్రీ మహాశక్తి దేవాలయంలో బండి సంజయ్ దంపతులు

కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన సతీమణి అపర్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ తొలి రోజు వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణాన్ని సందడిగా మార్చారు.

### భగత్‌నగర్‌లో వైభవంగా వేడుకలు

కరీంనగర్‌లోని భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తన సతీమణి అపర్ణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించే ఈ పండుగను కాలనీవాసులు, యూత్ క్లబ్ సభ్యులు కలిసికట్టుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు చేసుకోవడాన్ని ప్రశంసించారు. నగర ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

### బతుకమ్మను ఎత్తుకున్న గంగుల కమలాకర్

కరీంనగర్ నగరంలోని 45వ డివిజన్‌లో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై బతుకమ్మను ఎత్తుకొని వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగలు ప్రజలందరినీ ఒకచోట చేర్చి సంతోషాలను పంచుతాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా బతుకమ్మ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో మహిళలు గునుగు, తంగేడు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. సద్దుల బతుకమ్మతో పండుగ ముగియనుండటంతో జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

# ఉపాధి హామీ కల్పనలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్

## ఉత్తమ పనితీరుపై రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన




- శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్
- సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ
- ప్రణాళిక ప్రకారం జిల్లాలో వీబీజీ రామ్ జీ పనులు
- జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 4,02,360 పని దినాల కల్పన





> రామ్ జీ కింద ఉపాధి హామీ పనులు కల్పనలో జిల్లా రాష్ట్రంలో ముందు స్థానంలో నిలిచింది. జిల్లా యంత్రాగాన్ని రాష్ట్ర అధికార యంత్రాంగం అభినందించింది. శాశ్వత ఆస్తుల కల్పన.. వనరుల సంరక్షణ పనులు చేయిస్తూ జిల్లా అధికార యంత్రంగా ముందుకు సాగుతోంది.

--రాజన్న సిరిసిల్ల ప్రతినిధి
అక్టోబర్ -10 (ప్రజాజ్యోతి)

### విస్తృతంగా ఉపాధి హామీ పనులు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వికసిత్ భారత్-- గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవక మిషన్(వీ బీ జీ రామ్ జీ) కార్యక్రమం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

### ఇప్పటికే శిక్షణ.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ఉపాధి పనులపై జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తించి.. చేయిస్తున్నారు.

### గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం.

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 378 పనులు గుర్తించింది. రాష్ట్రంలోని ఆయా జిల్లాలకు అనువైన.. అలాగే కూలీలకు ఉపాధి కల్పించే పనులను అధికార యంత్రాంగం చేపడుతుంది. ప్రతి కూలీకి 125 పని కల్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు అధికారులు.

చెరువుల్లో పూడిక తీత, మట్టి రోడ్ల నిర్మాణం, ఫిష్ పాండ్స్, అటవీ భూముల్లో కందకాల నిర్మాణం, మొక్కలు నాటడం, సంరక్షించడం, అటవీ భూముల్లో మొక్కలు నాటడం, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణం, కంపోస్టు షెడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్య ఇస్తూ ముందుకు వెళ్తున్నారు. పొలాల కాలువల శుభ్రత, సాగునీటి కాలువల మరమ్మతు లాంటి శ్రమ ఆధారిత పనులను గుర్తించి చేయిస్తున్నారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ ను నియమించి, మొబైల్ ఫోన్ ద్వారా హాజరు నమోదు చేసేలా చర్యలు చేపట్టింది.

### మరింత పెంచేందుకు చర్యలు

జిల్లాలో మొత్తం 260 గ్రామ పంచాయతీలు ఉండగా, మొత్తం 98 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి రోజు 32, 148 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 09వ తేదీ వరకు 4,02,360 పని దినాలు కల్పించడం జరిగింది.

### తెలంగాణ జలసిరి పనులు

వాన నీటి సంరక్షణ, భూ గర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జలసిరి పథకం కింద పనులు చేయిస్తుంది. జిల్లాలో 210 ఫామ్ పాండ్స్, 1769 మ్యాజిక్ సోక్ పిట్స్, 91 సామూహిక ఇంకుడు గుంతలు, 464 బోర్ వెల్ రీచార్జ్ గుంతల పనులు పురోగతిలో ఉన్నాయి.

### రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన

జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి సగటున 45 మంది కూలీలు ఉపాగి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికం. ఉపాధి కల్పనలో ముందున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ కింద వేతనాలకు రూ.12 కోట్ల 90 లక్షలు ఇవ్వగా, మెటీరియల్ కోసం 76 లక్షల రూపాయలు కేటాయించారు. మెటీరియల్ కోసం ఇంకా 7 కోట్ల 37 లక్షల ఖర్చు చేయాల్సి ఉంది.

### కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక

గరిమ అగ్రవాల్, జిల్లా కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వీబీజీ రామ్ జీ కింద కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాము. ఇందులో భాగంగా ఇప్పటికే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తమ ప్రాంతంలో అనువైన పనులు చేయించడంపై శిక్షణ ఇప్పించాం. పనులకు కూలీలు భారీ సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషం. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాం.

---

## పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ నీటి విడుదల

**- మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్**



**రామగిరి, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి) :** వర్షాకాల పంటలను కాపాడి రైతులకు అండగా నిలిచేందుకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్లు రామగిరి మండల తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ తెలిపారు. రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ ద్వారా డీ-86, డీ-83 కాలువలకు నీటిని విడుదల చేయడంతో సోమవారం వరకు పంటలకు సాగునీరు అందనున్నట్లు పేర్కొన్నారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో నీటి లభ్యత రైతులకు ఉపశమనం కలిగిస్తుందని ఆమె అన్నారు. పంటల కోత పూర్తయ్యే వరకు రైతులకు అవసరమైన సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పంటలను కాపాడేందుకు నీటి విడుదలకు సహకరించిన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## పాలనను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత

# కేసీఆర్‌దే

- పెద్దపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం చారిత్రక నిర్ణయం
- జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- అమరవీరుల స్తూపానికి, అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నేతల నివాళులు
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శలు



**పెద్దపల్లి, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** పరిపాలనను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లిని ప్రత్యేక జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం పెద్దపల్లిలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

### అభివృద్ధికి బాటలు వేసిన కేసీఆర్ పాలన

తెలంగాణ సాధన అనంతరం కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, గురుకుల విద్యాసంస్థలు, వైద్య కళాశాలలు మరియు మిషన్ భగీరథ వంటి బృహత్తర కార్యక్రమాలతో వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో అభివృద్ధికి పెద్దపీట వేశారని కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటుతో కలెక్టరేట్‌తో పాటు అన్ని రకాల జిల్లా స్థాయి కార్యాలయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతుభరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్ల పెంపు, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా

### వికేంద్రీకరణ

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టి పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చారని అన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటుతో ప్రజల ప్రయాణ కష్టాలు తొలిగాయన్నారు. ఎలిగేడు ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

### అమరులకు, అంబేద్కర్‌కు నివాళులు

కార్యక్రమానికి ముందు పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు, బస్టాండ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## పత్తిపాకలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



ధర్మారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి ప్రకృతి సిద్ధమైన పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలతో ఆడిపాడారు. ప్రకృతిని పూజిస్తూ ఆడపడుచుల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగతో గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. ఈ వేడుకల్లో వరలక్ష్మి, వినోద, పద్మ, నీరజ, సుమ, సుజాత, స్వరూప, జమున, శారద, సత్య, రజిత తదితర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి గనుల్లో పర్యావరణ పనులకు ప్రశంసలు

**- ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రొఫెసర్ సుదీప్త ముఖోపాధ్యాయ**



**రామగిరి, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి) :** బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు సింగరేణి తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సుదీప్త ముఖోపాధ్యాయ, ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల్లో చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన సింగరేణి ప్రాంతాల్లో పర్యటించి, గనుల పరిసరాల్లో పచ్చదనం పెంపు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు అమలు చేస్తున్న చర్యలను పరిశీలించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ ముందుగా ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. గనుల నిర్వహణలో పర్యావరణ పరిరక్షణకు అనుసరిస్తున్న విధానాలు, చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటిన ఆయన, ఓసీపీ-1, ఓసీపీ-2 ఉపరితల గనులతో పాటు ఏఎల్‌పీ, జీడీకే-10 ఇంక్లైన్, వకీల్‌పల్లి గనులను సందర్శించారు. గనుల మూసివేత కార్యక్రమాల్లో భాగంగా కొనసాగుతున్న పనులతో పాటు క్షేత్రస్థాయిలో పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గనుల పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న పనులు బాగున్నాయని అభిప్రాయపడ్డారు. పర్యావరణ హిత చర్యలను ఇదే విధంగా కొనసాగిస్తూ, ప్రకృతి పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఎస్వోటు జీఎం ఎం. రామ్మోహన్, ప్రాజెక్టు అధికారి జె. రాజశేఖర్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్, పర్యావరణ అధికారులు కిషన్, ప్రశాంత్ జీవన్, కార్పొరేట్ పర్యావరణ విభాగం అధికారులు రవీంద్రనాథ్, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎస్సారెస్పీ నీళ్లు.. పంటలకు భరోసా!

- పంటలు చేతికొచ్చే వరకు ప్రయత్నాలు ఆగవు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయరమణారావు



**పెద్దపల్లి ప్రతినిధి,అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట కల్పించేలా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. సాగునీటి కొరతతో పంటలు దెబ్బతినకుండా కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ-రమణారావు తెలిపారు. శనివారం నిజామాబాద్ జిల్లా పోచంపాడు వద్ద విడుదల చేసిన నీరు రేవల్లి డిస్ట్రిబ్యూటరీ ద్వారా డి-86, డి-83 ప్రధాన కాలువల నుంచి పెద్దపల్లి నియోజకవర్గ పంటలకు సోమవారం వరకు అందుతుందని వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో పంటలను కాపాడటమే లక్ష్యంగా నీటి విడుదలకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. పంటలు చేతికొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. రైతులు అందుబాటులోకి వచ్చిన నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. నీటి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కరీంనగర్‌లో బీజేపీ బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్

- రెండు పార్టీలు నాటకాలతో మభ్యపెడుతున్నాయని విమర్శ
- సుడా మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ధ్వజం



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర రాజకీయ ప్రయోజనాల కోసం మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాకి పాల్పడుతున్నాయని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా రెండు పార్టీలు ప్రజలను రాజకీయ నాటకాలతో మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరోక్షంగా బీజేపీకి సహకరించి, ఆ పార్టీ పాలకవర్గం ఏర్పాటుకు తోడ్పడిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఇప్పుడు ఆ పార్టీ నాయకులే మాట్లాడటం విడ్డూరంగా ఉందని ప్రశ్నించారు. గణేశ్ నిమజ్జనానికి నీటి విడుదల అంశంలో బీజేపీ, బతుకమ్మ ఏర్పాట్లపై బీఆర్ఎస్ లబ్ధి కోసం రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ వైఖరిపై ప్రజల్లో విసుగు పెరుగుతోందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడే నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇస్తారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి రాజన్న సిరిసిల్ల బాలికల జట్టు



**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు శనివారం బయలుదేరింది. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ క్రీడాకారులకు డ్రెస్ కోడ్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ముస్కు మల్లారెడ్డి, కార్యదర్శి సింగారపు తిరుపతి, జట్టు కోచ్ కావ్య, మేనేజర్ సనత్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోగుల ఇబ్బందులకు చెక్ ఆసుపత్రిలో సీసీ ఫ్లోరింగ్



**పెద్దపల్లి, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
పెద్దపల్లి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగుల రవాణాకు ఎదురవుతున్న ఇబ్బందులను నివారిస్తూ మెడికల్ సూపరింటెండెంట్ చొరవతో పటిష్టమైన సీసీ ఫ్లోరింగ్ పనులు పూర్తయ్యాయి. ఆసుపత్రిలోని సీటీ విభాగం నుంచి టీ-హబ్‌లోని ఎక్స్‌రే విభాగానికి స్ట్రెచర్లు, వీల్‌చైర్లపై రోగులను తీసుకెళ్లే మార్గంలో ఫ్లోరింగ్ సరిగా లేకపోవడంతో తీవ్ర జాప్యంతో పాటు ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన సూపరింటెండెంట్ తక్షణమే స్పందించి ప్రత్యేక ఫ్లోరింగ్ నిర్మింపచడంతో ప్రస్తుతం రోగుల తరలింపు సులభంగా, సురక్షితంగా మారింది. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి సమస్యలు ఎదురైనా త్వరితగతిన పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ వెల్లడించారు.

## నేటితో అన్నప్రసాద వితరణకు ఏడాది పూర్తి



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం శనివారంతో విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే ఆదేశాల మేరకు ప్రతి అమావాస్య రోజున స్థానిక అయ్యప్ప మాలధారులు ఎల్లారెడ్డిపేటతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదానం అందిస్తున్నారు. ఈ సందర్భంగా మాలధారులు మాట్లాడుతూ.. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం మిక్కిలి పుణ్యకార్యమని, సేవాభావంతో ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో నిరంతరాయంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని అయ్యప్ప స్వాములు స్పష్టం చేశారు.




## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థిని సహస్ర ఎంపిక

**పెద్దపల్లి ప్రతినిధి 10 అక్టోబర్ (ప్రజా జ్యోతి):**
పెద్దపల్లి పట్టణంలోని రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గత నెల 30న పాఠశాలలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ అర్హత సాధించింది. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్, హెచ్ఎం హకీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి విద్యార్థినిని అభినందించి, రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు.



## కూలీలకు మజ్జిగ పంపిణీ

**ఎలిగేడు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఒంట్లో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు కూలీలు ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, గ్రామంలో వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, వార్డు సభ్యురాలు ఆసంపల్లి స్వప్న, జీపీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

### టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో ర్యాకల్ దేవ్ పల్లికి ప్రశంసా పత్రం

**ఎలిగేడు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**



క్షయ (టీబీ) రహిత గ్రామంగా గుర్తింపు పొంది 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమంలో ప్రశంసా పత్రం దక్కించుకున్న పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామపంచాయతీ శనివారం ప్రత్యేక అరుదైన ఘనత సాధించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మండల మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టినా, ఏఎన్ఎం జమున, ఆశా కార్యకర్తలు అమృత, స్వరూపలను శాలువాలతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్య సిబ్బంది సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్తులోనూ గ్రామాన్ని అన్ని రకాలుగా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

### ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ

**సుల్తానాబాద్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు మరియు ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం మహిళల్లో ఐక్యతను, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను పెంపొందిస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించగా, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## రసాయన రంగులు వద్దు.. ప్రకృతి పూలే ముద్దు!



**ధర్మారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామానికి చెందిన కాదాసి అమరేందర్ అనే యువకుడు సహజసిద్ధ రంగులతో పర్యావరణ హిత బతుకమ్మను తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. మార్కెట్లో లభించే రసాయన రంగుల పూల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని గ్రహించిన అమరేందర్.. పొలాల నుండి గునుగు, తంగేడు పూలను సేకరించి బీట్‌రూట్, గోరింటాకు రసం, పసుపు, కుంకుమ వంటి ప్రకృతి సిద్ధ రంగులను అద్ది బతుకమ్మను అందంగా పేర్చాడు. ప్రకృతి వనరులకు హాని తలపెట్టకుండా పండుగలను జరుపుకోవచ్చని ఆచరణలో చూపించి సందేశమిచ్చిన ఆ యువకుడి పర్యావరణ స్పృహను గ్రామస్తులు కొనియాడారు.

## పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ నీరు విడుదల

- రైతులు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలి
- మంథని మార్కెట్ కమిటీ చైర్మెన్ కుడుధుల వెంకన్న




**మంథని, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** రైతులు ఈ ఖరీఫ్ లో సాగుచేసిన పంటలను కాపాడేందుకు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్లు మంథని మార్కెట్ కమిటీ చైర్మెన్ కుడుదుల వెంకన్న తెలిపారు. శనివారం ఆయన మంథని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్ట్ నుంచి రేవెల్లి డిస్ట్రిబ్యూటరీ ద్వారా డీ-86, డీ-83 కాలువలతో సోమవారం వరకు పంటలకు నీరందుతుందన్నారు. పంటలు చేతికొచ్చే వరకు నీటి కృషి చేస్తామని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి విడుదలకు సహకరించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంత రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఎస్సారెస్పీ ద్వారా నీటిని అందించడమే కాకుండా రైతులకు సరిపడా విద్యుత్ సరఫరాకు చేస్తామన్నారు. ఎల్ నీలో ప్రభావంతో వర్షాలు సక్రమంగా పడకపోవడంతో రైతులు నీటిని సక్రమంగా అవసరమైన మేర మాత్రమే వినియోగించుకోవాలని కోరారు.

## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** వేములవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, వారు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేసిన అనంతరం ఆలయ డి.ఇ.ఓ ప్రతాప నవీన్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను బహూకరించారు. పూజల అనంతరం రాబోయే దసరా, సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిషనర్, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



## ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరాహార దీక్ష

- సీఈసీ రాజీనామా చేయాలి
- వైద్యుల అంజన్ కుమార్




**కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి ):** ఓటు చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ, టీపీసీసీ నాయకులకు మద్దతుగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ఓట్లు, సీట్ల చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుల నిరసనపై లాఠీచార్జి, అరెస్టులను ఖండించారు. అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తీరొక్క పూలతో బతుకమ్మ..

పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. ప్రకృతిలోని రంగులన్నింటినీ పూల సౌందర్యంలో నింపి.. ఆటపాటలతో తెలంగాణ ఆడపడుచులు జరుపుకునే బతుకమ్మ సంబరాలకు అంకురార్పణ జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అమావాస్య రోజున ఉదయాన్నే మహిళలు సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ తంగేడు, గునుగు తదితర పూలను సేకరించి, వాటిని అందంగా బతుకమ్మలుగా పేర్చుకున్నారు. రంగురంగుల పూలను వరుసలుగా అమర్చి, మధ్యలో గుమ్మడి పూలతో అలంకరించిన బతుకమ్మలు తెలంగాణ పల్లె ప్రకృతి అందాలకు అద్దం పట్టాయి. కొత్త దుస్తులు ధరించిన



ఆడపడుచులు సాయంత్రం వేళ బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లతో పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. బతుకమ్మ అంటే పూలను పేర్చడం మాత్రమే కాదు.. ప్రకృతితో ముడిపడిన తెలంగాణ జీవన సంస్కృతికి ప్రతిరూపం. వర్షాకాలంలో విరబూసే స్థానిక పూలకు ప్రాధాన్యమిస్తూ, వాటిని పూజించడం ద్వారా ప్రకృతిని గౌరవించే సంప్రదాయం ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తుంది. ఇంటిల్లిపాది మహిళలు ఒకచోట చేరి తమ సంతోషాలను పంచుకోవడం, కుటుంబ బంధాలను బలోపేతం చేసుకోవడం,

- తెలంగాణ ఆడపడుచుల సంబరాలకు శ్రీకారం
- ప్రారంభమైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

తరతరాలుగా వస్తున్న జానపద పాటలను భావితరాలకు అందించడం బతుకమ్మ వేడుకల ప్రత్యేకత. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోనూ బతుకమ్మ పాటల సందడి మొదలవడంతో పండుగ వాతావరణం నెలకొంది. పూల పరిమళాలు, సంప్రదాయ పాటలు, ఆడపడుచుల కోలాహలంతో తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఆచార వ్యవహారాలకు బతుకమ్మ పండుగ మరోసారి ప్రతీకగా నిలిచింది. రానున్న రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకతతో సాగే బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి.

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికలలో విజయంతో సంబరాలు

మంథని, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

ఆర్టీసీ యూనియన్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్ర మరియు రీజియన్ గుర్తింపు సాధించిన ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు) నాయకులు మంథని బస్ డిపో గేటు వద్ద శనివారం బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంథని డిపో టిఎంయు సెక్రటరీ కేకే రెడ్డి



మాట్లాడుతూ.. తమ యూనియన్ బిఆర్ఎస్ పార్టీకి అనుకూలమని కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండించారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుకూలమూ, వ్యతిరేకమూ కాదని, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా స్వతంత్రంగా పోటీ చేసి విజయం సాధించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ గంధం రమేష్, టిఎంయు అధ్యక్షుడు శేఖర్, ఏ రమేష్, ఐలయ్య, గ్యారేజ్ కార్మికులు పాల్గొన్నారు.

# సమతుల్యమైన వ్యాపారం - సంతృప్తికరమైన జీవితం




నేడు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వ్యాపార వాణిజ్య వర్గాల సదస్సు

కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి)

వ్యాపారంలో విజయంతో పాటు మానసిక ప్రశాంతత, సంతృప్తికరమైన జీవితాన్ని సాధించడంపై అవగాహన కల్పించేందుకు ఆదివారం కిసాన్‌నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బీకే విజయలక్ష్మి, బీకే మనీషా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ తెలిపారు. శనివారం బ్రహ్మకుమారీస్ కేంద్రంలో వివరాలు వెల్లడిస్తూ.. వ్యాపార, వాణిజ్య రంగాల్లో పనిచేసే వారు మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ప్రశాంతంగా ఉన్నప్పుడే తమ రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరిగే సదస్సులో బిజినెస్ వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ బ్రహ్మకుమారి దీప అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కోలగాని శ్రీనివాస్ పాల్గొని మార్గదర్శనం చేయనున్నట్లు వెల్లడించారు

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆకారి రాజేశం శుభాకాంక్షలు

కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను నంది మేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు ఆకారి రాజేశం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఆయన కరీంనగర్‌లోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో కుటుంబ సమేతంగా దుర్గాదేవి మాలాధారణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందాలు నింపాలని ఈ సందర్భంగా ఆయన



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆకారి రాజేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా బొడ్డెమ్మ నోము వేడుకలు

ఎలిగేడు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం బొడ్డెమ్మ నోము వేడుకలను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. బొడ్డెమ్మకు అమావాస్య చివరి రోజు కావడంతో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి వాయినాలు ఇచ్చిపుచ్చుకుని, గౌరమ్మను పూజించిన అనంతరం బొడ్డెమ్మను నిమజ్జనం చేశారు. అనంతరం రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఆటపాటలతో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కేశెట్టి శరణ్య, ప్రధాన కార్యదర్శి శిరీష, ఉపాధ్యక్షురాలు అరుణ, ముఖ్య సలహాదారు తాటిపల్లి జ్యోతిలక్ష్మితో పాటు వాసవి సంఘం మహిళలు పాల్గొన్నారు.



## సిజెపి నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

కొనరావుపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా అర్హులైన పౌరుల ఓట్లను తొలగిస్తున్నారనే అంశంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపడానికి వెళ్లిన సిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని భీమ్ ఆర్మీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ నాయకులను అరెస్టు చేయడం, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం అన్యాయమన్నారు. సిజెపి నేతలు అభిజిత్ డిప్కే, సౌరావ్ దాస్, అశుతోష్ సహా న్యాయవాదులను తక్షణమే విడుదల చేయాలని మరియు ఓటర్ల జాబితా అవకతవకలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు నరేష్, అమర్, దాస్, రాజయ్య, రాజు, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటలో చెరువులో మునిగి యువకుడు మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో చేపల వేటకు వెళ్లిన మోతే కిరణ్ అనే యువకుడు చెరువు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లి నీటమునిగిన అతడి కోసం గాలించిన 17వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ బృందం శనివారం ఉదయం మృతదేహాన్ని వెలికితీసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కిరణ్ అకాల మరణంతో భార్య, ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు.

# ప్రతి ఒక్కరూ మానసికంగా బలంగా ఉండాలి

- మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మనందరి బాధ్యత
- సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్



**కరీంనగర్,, అక్టోబర్ 10: (ప్రజాజ్యోతి)**
ప్రతి ఒక్కరూ మానసికంగా బలంగా ఉండాలని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన సహాయం అందించడం మనందరి బాధ్యత అని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ వేముల అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలని, ఆత్మహత్య ఆలోచనలతో సతమతమవుతున్న వారిని ఆదుకోవాలని సూచించారు. కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యలు, సంబంధాల్లో తలెత్తే ఇబ్బందులతో బాధపడుతున్న వారి మాటలను ఓపికగా విని, వారికి తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడంతోపాటు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. మానసిక సమస్యలు బలహీనతకు గుర్తు కావని, సమస్యలు ఎదురైనప్పుడు సంకోచించకుండా కౌన్సెలింగ్ తీసుకోవడంతోపాటు అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. సమాజానికి తమ వంతు సహాయం అందించేందుకు అసోసియేషన్ సిద్ధంగా ఉందని, పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన తరగతులు నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ మరియు లైఫ్ కోచ్ కోరిటాల అనురాధ, ఉపాధ్యక్షురాలు, మోటివేషనల్ స్పీకర్ కె. అనిత, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ అలివేణి, అసోసియేషన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే బీఆర్ఎస్ డ్రామా రాజకీయాలు

- ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్
- బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్




**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్‌లో ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు డ్రామా రాజకీయాలకు తెరలేపుతున్నారని కిసాన్‌నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ విమర్శించారు. శనివారం కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ కాలం తీరిన పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. తమ పార్టీలోని వారినే కొత్తగా చేరినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.
గత పదేళ్ల పాలనలో ప్రభుత్వ భవనాలకు గులాబీ రంగు వేయించిన నాయకులు, ఇప్పుడు కాషాయ రంగుపై అభ్యంతరాలు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తీరును తప్పుపడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని స్పష్టం చేశారు. కిసాన్‌నగర్‌లో దళితబంధు ఇళ్ల పేరుతో పేదల నుంచి వసూలు చేసిన డబ్బులను తక్షణమే తిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో స్మార్ట్ సిటీ నిధులతో నగరాభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రె పద్మా అనిల్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకు పదవి అవసరం లేదు: ఎండీ మంజూర్

**రామగిరి, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
ప్రజా సేవ చేయడానికి పదవులతో సంబంధం లేదని లొంక కేసారం గ్రామ మాజీ సర్పంచ్ ఎం.డి. మంజూర్ నిరూపించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రామ మహిళలు సంతోషంగా జరుపుకోవడానికి ఆయన ఉచితంగా సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. హిందూ పండుగకు తనవంతు సహకారం అందించి మతసామ-రస్యానికి, ఐక్యతకు చక్కని ఉదాహరణగా నిలిచారు. పదవి లేకున్నా గ్రామ సంక్షేమం, ప్రజల సంతోషం కోసం పాటుపడుతున్న



ఆయన ఉదారతపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## జాన్సన్, కోరా, ఏఎన్‌సీ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
కరీంనగర్ విద్యానగర్‌లోని జాన్సన్, కోరా, ఏఎన్‌సీ హైస్కూల్‌లో శనివారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు. ఈ వేడుకలకు పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రామ్‌రెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగాల సంతోష్‌రెడ్డి హాజరై బతుకమ్మలను అందంగా అలంకరించిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.




## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ధర్మారం విద్యార్థినుల ఎంపిక

**ధర్మారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి. హర్షిత, జి. శ్రీనిత్య గత నెల 30న పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఈ అర్హత సాధించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరగనున్న 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్, ఎండి జైన రమాదేవి, పిఈటి సాయి కుమార్ అభినందించి, పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి.. ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 ప్రజా జ్యోతి:**
సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్నారు. మృతుడిని గుర్తించినవారు లేదా ఆయన కుటుంబ సభ్యుల వివరాలు తెలిసినవారు పెద్దపల్లి ఎస్సైకు 8712656506 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# క్రీడారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: విజయరమణారావు

- సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం
- రెండు స్వర్ణాలు సాధించిన చికితను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు



**సుల్తానాబాద్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** క్రీడారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్-2 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి లీగ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో రెండు స్వర్ణ పతకాలు సాధించిన స్థానిక క్రీడాకారిణి చికితను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఆర్థిక ఇబ్బందులను దాటుకుంటూ విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రేగడి మద్దికుంటలో అవకతవకలపై విచారణ జరిపించాలి

**సుల్తానాబాద్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామపంచాయతీలో జరుగుతున్న నిధుల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్‌గౌడ్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీలో తప్పుడు లెక్కలు నమోదు చేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఇదే విషయంమై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు సైతం వినతిపత్రం అందజేసినట్లు ఆయన వెల్లడించారు.



# ప్రగతి నగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 ప్రజా జ్యోతి:** పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్‌లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరుకున్న ఆడబిడ్డలు, చిన్నారులు, అమ్మలు, వదినలు, అక్కాచెల్లెళ్లు అందరూ ఒక్కచోట చేరి బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కలయికతో ప్రగతి నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రకృతి పూలను పూజిస్తూ, ఆడబిడ్డల ఆత్మీయతకు ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని ఆకాంక్షిస్తూ పెద్దపల్లి పట్టణ ప్రజలందరికీ, హిందూ బంధువులందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.



# గీర్వాణి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**చొప్పదండి, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** చొప్పదండి పట్టణంలోని గీర్వాణి పాఠశాలలో ప్రిన్సిపాల్ కొండ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్ళు బతుకమ్మను తిరోక రంగు,రంగు పూలను తెచ్చి బతుకమ్మను పేర్చి తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా ఆడి పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయానికి అనుగుణంగా అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండగని, చిన్నా, పెద్ద అనే బేధ భావాలు లేకుండా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునేది బతుకమ్మ పండగని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ లు కోడూరి నాగరాజు, సిరిపురం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**చొప్పదండి, అక్టోబర్ 10 ( ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం పెద్ద కుర్మపల్లె, రేవెల్లి, దేశాయిపేట గ్రామాలలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రేషన్ కార్డు అనేది ప్రతీ పేదవాడు ఆత్మ గౌరవంగా భావిస్తారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందించడంతో పాటు సన్నబియ్యంతో వారి కడుపు నింపుతున్నమన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి, పట్టుదలతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మావురం సుగుణ, అజయ్, వడ్లకొండ తిరుమల, విండో చైర్మన్‌లు మనోహర్, శ్రీనివాసరెడ్డి, చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస, పిట్టల వెంకటేష్, కనుమల్ల రాజశేఖర్, నాయకులు వల్లాల కృష్ణహరి, కూకట్ల రాజేష్, పెరుమాండ్ల రవీందర్, కొత్తూరి శంకర్, నల్లాల అఖిల్, పల్లపు కుమార్ పాల్గొన్నారు.



## ఉపాధి హామీ కూలీల బతుకమ్మ సంబరాలు

**ధర్మారం, అక్టోబర్ 10(ప్రజా జ్యోతి):**
మండలంలోని ఖిలావనపర్తి, నర్సింగాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలోనే ఎంగిలిపూల బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు మోతె కనకయ్య,బంగుటపు కొమురయ్య, ఉప సర్పంచ్ మోతె కావ్య, వెంకటస్వామి హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల ప్రత్యేక పండుగ అని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.నర్సింగాపూర్ లో వేడుకలకు ఏర్పాట్లు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ తోట సునీతను సర్పంచ్ కొమురయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఖిలావనపర్తిలో వేడుకలకు ఏర్పాట్లు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ కాశిపాక రాజయ్యను అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**కోనరావుపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై రామ్మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులను ఆపి బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, పండుగల నేపథ్యంలో ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

**కోనరావుపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు కోనరావుపేట మండలం పల్లిమక్తతో పాటు మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహిళలు, యువతులు రకరకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని కూడళ్ల వద్ద గుమిగూడిన మహిళలు సాంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. రానున్న తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలతో వేడుకలు నిర్వహించి, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ఈ ఉత్సవాలను ముగిస్తామని వారు తెలిపారు. ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెద్దపల్లిలో బీజేపీ గెలవకుంటే గుండు కొట్టించుకుంటా..!

- జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి సంచలన సవాల్
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు
- ఎస్టీ మోర్చా నూతన కమిటీ ప్రకటన



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 10 ప్రజా జ్యోతి:**
పెద్దపల్లి నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించకపోతే గుండు కొట్టించుకుంటానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి సంచలన సవాల్ విసిరారు. పెద్దపల్లి గడ్డపై కమలం జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం పెద్దపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని, యువత బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పెద్దపల్లి సహా పలు ప్రాంతాల్లో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు కేంద్రం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలకు దూరంగా ఉండాలని, అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వెలమల పార్టీగా, కాంగ్రెస్ రెడ్డిల పార్టీగా వ్యవహరిస్తున్నాయని సంజీవరెడ్డి ఆరోపించారు. బీసీలు, పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయగలిగేది బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, మృతుల పేర్లతో ఉన్న ఓట్లు, నకిలీ ఓట్ల తొలగింపును వ్యతిరేకించడం సరికాదని వ్యాఖ్యానించారు.

**ఎస్టీ మోర్చా జిల్లా కమిటీ నియామకాలు**
సమావేశంలో బీజేపీ ఎస్టీ మోర్చా పెద్దపల్లి జిల్లా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్ రామ్ జా ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జి. సురేష్ నాయక్, లింగం నాయక్, విజయ; ప్రధాన కార్యదర్శులుగా జి. రమేష్, బలవంత్ అనిల్ నాయక్; కార్యదర్శులుగా ఎస్లావత్ శ్రీనివాస్, రాజేష్ రాథోడ్, సమయ్యలను నియమించారు. జిల్లా సామాజిక మాధ్యమాల కన్వీనర్లుగా ఎస్లావత్ సతీష్, నేనావత్ అరుణ్ కుమార్, పర్యటనలు--పర్యవేక్షణ కన్వీనర్‌గా లావుడ్యా రాజేష్, మన్ కీ బాత్ కన్వీనర్‌గా అజ్మీరా కిరణ్‌ను నియమించి నియామక పత్రాలు అందజేశారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం లక్ష్యంగా పనిచేయాలని నూతన పదాధికారులకు నాయకులు సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు, యువమోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాల్వ శ్రీరాంపూర్‌లో బతుకమ్మ కోలాహలం

### వేడుకల్లో ఎస్సై గట్ల సుధాకర్, సర్పంచ్ బంగారి రమేష్

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 10, ప్రజా జ్యోతి:**
కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.మహిళలు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.డీజే పాటలు కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి.సర్పంచ్ బంగారి రమేష్ ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకకు ఎస్సై గట్ల సుధాకర్ గ్రామ సర్పంచ్ బంగారి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక అయినా బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోలి సుధాకర్,కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం మండల అధ్యక్షులు శివరామకృష్ణ, వార్డు



సభ్యులు జనగామ అన్వేష్, దండి అజయ్ మరియు మహిళలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

# కలసాన్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**మానకొండూర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**
మానకొండూరు మండలం పోచంపల్లిలోని కలసాన్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బతుకమ్మ ముందస్తు వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి, ప్రకృతితో అనుబంధానికి ప్రతీక అని, పిల్లలకు సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ సిలువదాసన్, కరస్పాండెంట్ ఫాదర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొని ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు.

# బతుకమ్మ సంబరాలతో పండుగ వాతావరణం

- ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, కమిషనర్
- తొలిరోజు ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** వేములవాడ పట్టణంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పితృ అమావాస్యను పురస్కరించుకుని తొలిరోజు ఆడపడుచులు తీరొక్క పూలతో చిన్న బతుకమ్మలను పేర్చి వీధుల్లో ఆటపాటలతో సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో అలరారే ఈ పుణ్యక్షేత్రం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతోంది. పట్టణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఘాట్ వద్ద లైటింగ్, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు భద్రత కల్పించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

# గాయత్రీ నగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**సంప్రదాయ ఆటపాటలతో సందడిగా సాగిన పూల పండుగ**



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను గాయత్రీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో బతుకమ్మల చుట్టూ కోలాహలంగా ఆడిపాడారు. కాలనీ కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు గూట్ల శంకర్, మోసర్ల రాంరెడ్డి, పూసాల సంపత్, భీమానాతుని శ్రీనివాస్, డాక్టర్ శివ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి దివ్యాంగుల ఆశ్రమానికి 50 కిలోల బియ్యం వితరణ

**జమ్మికుంట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** జమ్మికుంట మండల కేంద్రంలోని సాయి దివ్యాంగుల ఆశ్రమ విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని శనివారం అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త గంగిశెట్టి జగదీశ్వర్ ఈ బియ్యాన్ని ఆశ్రమ నిర్వాహకులు బుచ్చి రాములుకు అందజేయగా, ఆయనతో పాటు విశ్రాంత ఉపాధ్యాయుడు ఇనుగోల ప్రసాద్ ఆశ్రమ విద్యార్థుల కోసం పప్పు, కూరగాయలను సమకూర్చారు. గంగిశెట్టి ట్రస్ట్ గతంలోనూ ఆశ్రమానికి దుప్పట్లు, తువ్వాళ్లు అందజేసి తన సేవా దృక్పథాన్ని చాటుకుందని నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రంగురంగుల బతుకమ్మలతో మెరిసిన ఊరు వాడ

- ఆడపడుచుల ఆటపాటలతో సంబురాలు
- వైభవంగా మొదలైన బతుకమ్మ వేడుకలు

**మంథని, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఊరువాడ మెరిసింది. ఎన్ వైభవంగా బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు ప్రారంభించారు. బతుకమ్మ పండుగలో మొదటి రోజైన ఎంగిలి పువ్వుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. అంచెలంచెలుగా సమానంగా ఉండేలా పేర్చేటప్పుడు ఆ పూల కాడలు చేతులతో సమానంగా చుంచి బతుకమ్మలను పేర్చారు. ఆశ్వయుజ మాసం ఆరంభం అమావాస్య రోజు నుంచి మహిళలు, ఆడపిల్లలు బతుకమ్మ వేడుకలను 9 రోజులపాటు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి ఆడపడుచులు ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు. మంథని డివిజన్లోని మంథని, కమాన్పూర్ ముత్తారం, రామగిరి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, మంథని మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తొలి రోజు బతుకమ్మలను నిమజ్జనం చేయకుండా అర్ధరాత్రి తమ గృహాల్లోని పచ్చని చెట్ల వద్ద ఉంచి వేడుకలు ముగించారు.





## వైద్యం కోసం రూ. 2.50 లక్షల ఎల్ఓసీ అందజేత



**ముత్తారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన దేవలత అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2,50,000 ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. ఈ సహాయానికి సంబంధించిన పత్రాలను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆసుపత్రి సహాయకులు బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా కల్పించిన మంత్రి శ్రీధర్ బాబుకు దేవలత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పూల సింగిడిగా బతుకమ్మ సంబురాలు



**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలతో వేములవాడ పట్టణం ముస్తాబవుతోంది. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ పూల పండుగ ఉత్సాహంగా సాగనుండగా, చివరి రోజు నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలతో సంబురాలు అంబరాన్నంటనున్నాయి. పెతర అమావాస్య రోజున పితృదేవతలను స్మరించుకుంటూ మహిళలు ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళల ఆటపాటలు, సంప్రదాయ గీతాలతో పట్టణంలోని వీధివీధినా పండుగ శోభ సంతరించుకుంది.

## కోనరావుపేటలో ఘనంగా దుర్గాదేవి ఆగమన ఉత్సవం

**కోనరావుపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండల కేంద్రంలో శనివారం దుర్గాదేవి ఆగమన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కోలాటాలు, డప్పు చప్పుళ్లతో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమానికి సీఐ రవీందర్, ఎస్సై రామ్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఊరేగింపులో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# రోడ్లపై ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించిన సర్పంచులు

**ముత్తారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** రహదారులపై వెళ్లే వాహనదారులు, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముత్తారం మండలంలోని కేశనపల్లి, అడవి శ్రీరాంపూర్ గ్రామాల్లో ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను శనివారం తొలగించారు. కేశనపల్లి సర్పంచ్ పెగడ తిరుమల-కుమార్, అడవి శ్రీరాంపూర్ సర్పంచ్ బొంతల అన్నపూర్ణ-ఉపేందర్ ప్రత్యేక చొరవతో గ్రామ పంచాయతీ సిబ్బంది ఈ పనులను పూర్తి చేశారు. రహదారులకు ఇరువైపులా విస్తరించి ప్రమాదాలకు కారణమవుతున్న కొమ్మలను తొలగించి రాకపోకలను సుగమం చేశారు. ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టిన సర్పంచులకు, పంచాయతీ సిబ్బందికి స్థానిక గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.





# బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల నిర్వహణకు వేములవాడ మున్సిపల్ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా పట్టణ ప్రజలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపాలిటీ తరఫున ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. వార్డుల్లో బతుకమ్మ ఆడే స్థలాలతో పాటు, మూలవాగు నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పూర్తి చేసి గ్రావెల్, విద్యుత్ దీపాల సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భగత్ నగర్‌లో వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు

**హాజరైన యాదగిరి సునీల్ రావు- అపర్ణ దంపతులు**



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి ):** భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, సునీల్ రావు-అపర్ణ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. ప్రకృతిని పూజించే విశిష్టమైన పండుగను భగత్ నగర్ కాలనీవాసులు, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు అంతా కలిసికట్టుగా ఉత్సాహంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలను ఘనంగా నిర్వహించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భగత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు, కాలనీ మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మంథని ఫ్లైఓవర్ వద్ద పేకాట స్థావరంపై పోలీసుల దాడి



**ఎద్దపల్లి, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి పట్టణంలోని మంథని ఫ్లైఓవర్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పెద్దపల్లి టౌన్ పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ. 18,300 రొక్కంతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి టౌన్ ఎస్ఐ తెలిపారు. జూదక్రీడలు, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.



# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

**కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ సాంకేతికత సహాయంతో కరీంనగర్ రూరల్ పోలీసులు గుర్తించి బాధితుడికి శనివారం అందజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన కవ్వంపల్లి వెంకటయ్య ఇటీవల తన ఒప్పో ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టెక్ టీమ్ సీఈఐఆర్ విధానంలో ఫోన్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేసి, జగిత్యాలలో దానిని స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. సాంకేతికతతో ఫోన్‌ను త్వరితగతిన రికవరీ చేసిన టెక్ టీమ్ కానిస్టేబుళ్లు రాంసాయి, రమేష్‌లను రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్‌రెడ్డి అభినందించారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన వొడితల ప్రణవ్



**ఇల్లందకుంట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో నిలిచిపోయిన దళిత బంధు పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని, దళిత కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. దళితుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధుల విడుదల ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి ప్రణవ్‌కు హామీ ఇచ్చారు.

## శ్రీ భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**వేములవాడ, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, అధికారులు స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాలను అందజేశారు. దసరా, బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, భీమేశ్వర సదన్ వద్ద మహిళలు బతుకమ్మ ఆడేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాంగణాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, క్యూలైన్ల వసతులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు

**కోరుట్ల, అక్టోబర్ 10 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల శ్వేత మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, భావితరాలకు మన సంస్కృతిని పరిచయం చేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని



తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్ల తొలగింపుపై నిరసన

- భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నాయకుల డిమాండ్




**కోరుట్ల, అక్టోబర్ 10 ప్రజాజ్యోతి**

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలను నిరసిస్తూ వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య సంఘాల నాయకులు కోరుట్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు, ఎం.పి.జె. తదితర ప్రజాస్వామ్య శక్తుల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

### ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలి

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను సరైన కారణాలు లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### పేర్ల తొలగింపుపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్ల తొలగింపునకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటంతో పాటు, ఓటు హక్కుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చేన్న విశ్వనాథం, సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుతారి రాములు, ఎం.పి.జె. కోరుట్ల అధ్యక్షుడు మొహమ్మద్ నసీర్, జమాతే ఇస్లామీ హింద్ కోరుట్ల అధ్యక్షుడు ఇలియాస్ అహ్మద్ ఖాన్, ఎం.పి.జె. కోరుట్ల జనరల్ సెక్రటరీ అంజద్ అలీ, అబ్దుల్ బారి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, రాజేష్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్, ప్లంబర్ యూనియన్ అధ్యక్షుడిగా చీర్నేని నరేష్ ఎన్నిక

**బీర్ పూర్, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల ఎలక్ట్రికల్ మరియు ప్లంబర్ యూనియన్ అధ్యక్షుడిగా బీర్ పూర్ గ్రామానికి చెందిన చీర్నేని నరేష్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఆయన అందించిన సేవలను గుర్తించి మండలంలోని సుమారు 70 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఆయనను వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇదే క్రమంలో ఉపాధ్యక్షుడిగా బండారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అరిపెల్లి పూర్ణచందర్, కోశాధికారిగా అడెపు జగదీష్‌లను ఎన్నుకోవడంతో నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో



ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులందరికీ నరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సారెస్పీ నీటి విడుదలకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం

**ఒజ్జెల శ్రీనివాస్**



**మెట్‌పల్లి, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**

పొట్ట దశలో ఉన్న వరి పంటకు సాగునీరు అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ చేసిన కృషితో ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల కావడం అభినందనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్ తెలిపారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరడంతో, నియోజకవర్గంతో పాటు జగిత్యాల జిల్లాకు 2,000 క్యూసెక్కుల నీరు విడుదలైనట్లు పేర్కొన్నారు. పంట కీలక దశలో ఉన్న సమయంలో నీటి విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యేకు రైతుల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దసరా, దుర్గా నవరాత్రులకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**

దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం తెలిపారు. దుర్గాదేవి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటల పాటు వాలంటీర్ల సేవలు అందించాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యమిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు

## బతుకమ్మ వేడుకలకు సిద్ధం గోపులాపూర్‌లో పారిశుధ్య పనులు

**బుగ్గారం, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి):**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బీర్పూరి తిరుపతి, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో అదనపు కూలీలను ఏర్పాటు చేసి రహదారుల ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెట్ల పొదలను తొలగించారు. వేడుకల వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. పండుగ సందర్భంగా పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక చర్యలు చేపడుతున్న పాలకవర్గాన్ని స్థానికులు అభినందించారు.



# పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలు

**విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలి**

**పోలీసుల త్యాగాలు, ప్రజా రక్షణపై అవగాహనకే పోటీలు**

**ఈనెల 20వ తేదీలోగా ఎంట్రీలు సమర్పించాలని స్పష్టం**

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పిలుపు**

**కరీంనగర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** అక్టోబర్ 21న నిర్వహించనున్న 'పోలీస్ ఫ్లాగ్ డే--2026'ను పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, లఘు చిత్రాలు (షార్ట్ ఫిల్మ్స్), ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు చేస్తున్న త్యాగాలు, ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని కమిషనర్ తెలిపారు.

**వ్యాసరచన పోటీల వివరాలు**

12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పోలీస్ స్టేషన్ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. సైబర్ నేరాల నివారణలో పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడం, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ పోటీలు ఉంటాయి. అలాగే డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో పౌరుల పాత్ర అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తారు.

**లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలు**

పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజా భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే విధంగా గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివితో తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్ల భాషల్లో లఘు చిత్రాలను రూపొందించవచ్చు. ఇక ఫోటోగ్రఫీ పోటీల కోసం పోలీసుల విధులు, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, పోలీస్-ప్రజల సంబంధాలపై ఇటీవల తీసిన ఫోటోలను పంపించాలి. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఎంట్రీలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి విజేతలకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

**ఎంట్రీల సమర్పణ గడువు**

లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు తమ ఎంట్రీలను సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (ఎస్‌హెచ్‌ఓ) ద్వారా ఈ నెల 20వ తేదీలోగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సీపీ కోరారు. విద్యార్థులు, యువత, ఫోటోగ్రఫీ అభిరుచి కలిగినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.



# మోదీ ప్రభుత్వ నిరంకుశ ధోరణిని ఖండిస్తున్నాం

- కేంద్ర విధానాలు ఎమర్జెన్సీ పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని విమర్శ
- మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి

**జగిత్యాల, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి పేర్కొన్నారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను హరించారని ఆరోపించే బీజేపీ నాయకులు, ప్రస్తుతం తమ పాలన ద్వారా ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితాల నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వంటి అంశాలపై ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేయడం, ఇంటెలిజెన్స్, మిలిటరీ సేవలను వినియోగించుకోవడం, దేశ రాజధాని ఢిల్లీలో ఆంక్షలు విధించడం వంటి చర్యలు ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను గుర్తుకు తెస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు,



ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం




- విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులకు ఘన సత్కారం
- అవార్డులతో పాటు నగదు బహుమతులు అందజేత
- వైభవంగా సాగిన 'అలీ ఫౌండేషన్' ప్రతిభా పురస్కారాల వేడుక

**కోరుట్ల, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** విద్యార్థుల్లో విద్యా ప్రతిభను ప్రోత్సహించడం, సమాజ అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి గౌరవించడమే లక్ష్యంగా కోరుట్లలో అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కింగ్స్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2025--2026 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

**వివిధ రంగాల ప్రముఖులకు ఘన సత్కారం**

విద్యార్థులతో పాటు సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను అలీ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రత్యేకంగా గౌరవించారు. ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ఉత్తమ వైద్యుడు, ఉత్తమ అధికారి, ఉత్తమ ఇమామ్, ఉత్తమ మౌజన్, ఉత్తమ ఇస్లామిక్ ఉపాధ్యాయురాలికి అవార్డులు, మెమొంటోలు, శాలువాలతో పాటు నగదు బహుమతులను అందజేసి సత్కరించారు. విద్య, వైద్యం, పరిపాలన, ఆధ్యాత్మిక రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించడం ద్వారా సమాజానికి నూతన స్ఫూర్తి లభిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

**ప్రతిభకు తగిన గుర్తింపుతో ఆత్మవిశ్వాసం**

విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అలీ ఫౌండేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇతరులలోనూ పోటీతత్వం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీ ఫౌండేషన్ కోరుట్ల అధ్యక్షులు ఎండీ మసూద్ అలీ అక్బర్, చీఫ్ ప్యాట్రన్ ఎండీ ఇక్బాల్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుఫ్ అలీ, మౌలానా అహ్మద్ అబ్దుల్లా ఖాస్మీ, నజీబుద్దీన్, ఆరిఫ్ అలీ, ముఫ్తీ ఇమ్రాన్, ముఫ్తీ జమీర్ అలీ సబీలీ, డాక్టర్ సిద్ధిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో అన్నప్రసాద వితరణ

- సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో
- 800 మంది భక్తులకు అన్నప్రసాద పంపిణీ

**కోరుట్ల, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** కోరుట్ల కొత్త బస్టాండ్ ఆవరణలో శనివారం సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ కృష్ణ శర్మ



వైదిక నిర్వహణలో సామూహిక గోపూజ, అన్నపూర్ణ మాత పూజ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన అనంతరం సుమారు 800 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. పితృదేవతల ప్రీత్యర్థం, లోకకల్యాణం కోసం ప్రతి అమావాస్య రోజున నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం గత 15 నెలలుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ఉపయోగించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు బట్టు హరికృష్ణ, రేగుంట రాజారాం, వనపర్తి చంద్రమోహన్, గంప శివకుమార్, మంచాల రమేష్, పడిగల శ్రీనివాస్, ఆధ్యాత్మిక సేవకులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: సంజయ్

- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ప్రారంభం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల బాక్సింగ్, తైక్వాండో, కరాటే పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అలవంర్చుతాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చక్రధర్ రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సేవాదళ్ పోస్ట్‌కార్డుల వినూత్న ఉద్యమం అభినందనీయం

- సీఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్



**జగిత్యాల, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** భారత రాష్ట్రపతికి లక్ష పోస్ట్‌కార్డులు పంపించే లక్ష్యంతో కాంగ్రెస్ సేవాదళ్ చేపట్టిన వినూత్న ఉద్యమం అభినందనీయమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్ ఖన్నా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆలోచనా విధానానికి అనుగుణంగా వ్యవహరిస్తున్న సీఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఖరారు

- కాంగ్రెస్ బలోపేతానికి కొత్త కార్యవర్గం
- డీసీసీ అధ్యక్షుడు ఘజంగి నందయ్య

**మల్లాపూర్, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** మల్లాపూర్ మండల కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుడు ఘాజంగి నందయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగా రావు, జువ్వాడి కృష్ణారావుల సమక్షంలో కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా మాట్ల సోమయ్య, ఉపాధ్యక్షులుగా ఎండీ జమాల్, మిట్టపల్లి జలపతి, ఈల జీవన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఏలేటి వెంకట్‌రెడ్డి, మోతె భూమయ్య, కోశాధికారిగా బొడిసె నర్సయ్య నియమించారు. కార్యదర్శులుగా ఈసపల్లి రాఘవులు, జంగ రజిత, కోటగిరి బక్కన్న, నల్ల శ్రీనివాస్, ఎలాల రాజేష్‌రెడ్డి, గుగ్లావత్ రాజశేఖర్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రొండ్ల రవి, సూరకంటి సంతోష్, మాదం గంగాధర్, భూక్య ఆనంద్ నాయక్, నల్ల జగన్‌రెడ్డి, గొట్టిపర్తి నారాయణ, చిప్ప లక్ష్మణ్‌లను నియమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# పత్తేం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

**గత 26 ఏళ్లుగా సామాజిక సేవలకు దక్కిన గుర్తింపు**

**'డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్' అవార్డును అందించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ**

**చెన్నైలో జరిగిన వేడుకలో పురస్కారం అందజేత**

**చిగురుమామిడి మండల ప్రజల హర్షం, పలువురి అభినందనలు**

**చిగురుమామిడి, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పత్తేం శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్) లభించింది. గత 26 సంవత్సరాలుగా ఆయన సమాజానికి అందించిన విశిష్ట సేవలను, విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీస్తూ చేపడుతున్న సామాజిక చైతన్య కార్యక్రమాలను గుర్తిస్తూ 'యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ & ఎక్సలెన్స్' ఈ గౌరవాన్ని ప్రకటించింది.

**చెన్నైలో ఘనంగా పురస్కార ప్రదానం**

తమిళనాడు రాజధాని చెన్నైలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్ కే. వెంకటేశన్, జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహా గౌడ్, ప్రపంచ శాంతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పర్వీందర్ సింగ్, తెలంగాణ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి విజయమోహన్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా పత్తేం శ్రీనివాస్ ఈ గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు.

**సేవా దృక్పథానికి నిదర్శనం: యూనివర్సిటీ ప్రతినిధులు**

ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్ డాక్టర్ కే. వెంకటేశన్ మాట్లాడుతూ.. సమాజంలో ఇతరులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా, మానవాళికి స్ఫూర్తినిచ్చేలా విశేష కృషి చేసిన వ్యక్తులకు యూనివర్సిటీ తరఫున అత్యున్నత గౌరవంగా ఈ డాక్టరేట్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. హోదాల కంటే సేవ, నిజాయితీ, సానుకూల ప్రభావమే నిజమైన గొప్పతనానికి ప్రామాణికమని పేర్కొన్నారు.

**మండలవ్యాప్తంగా అభినందనల వెల్లువ**

సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయం ద్వారా గౌరవ డాక్టరేట్ సాధించిన పత్తేం శ్రీనివాస్‌ను చిగురుమామిడి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు కొనియాడారు. ఆయన సాధించిన ఈ గుర్తింపుపై తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# ఆగని ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు..

## అన్నదాతలకు తప్పని ఇక్కట్లు!





- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దొంగతనాలు
- నెల రోజుల వ్యవధిలోనే ఒకే చోట రెండుసార్లు చోరీ
- సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు
- రాక్షస చర్యలపై మండిపడుతున్న బుగ్గారం రైతులు

**బుగ్గారం, అక్టోబరు 10 (ప్రజాజ్యోతి):** వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బుగ్గారం మండలంలోని మద్దునూర్ గ్రామం నుంచి రాయపట్నం వెళ్లే దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం ఉదయం మరోసారి చోరీకి గురైంది. నెల రోజుల వ్యవధిలోనే ఒకే ప్రాంతంలో రెండుసార్లు దొంగతనం జరగడంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎండిపోతున్న పంటలు.. రైతుల్లో ఆవేదన

పంట పొట్టదశకు వచ్చి నీరందించాల్సిన కీలక సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికావడంతో వ్యవసాయ మోటార్లు మూగబోయాయి. సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, సాగునీటి కోసం పెట్టిన వేలాది రూపాయల పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతాయని వాపోతున్నారు.

### అదనపు భారంతో సతమతం

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగిన ప్రతిసారీ కొత్తది తెచ్చుకోవడం, రవాణా ఖర్చులు భరించడం రైతులకు అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. ఇప్పటికే సాగు ఖర్చులతో సతమతమవుతున్న తమపై ఈ దొంగతనాలు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయని వాపోతున్నారు.

### అధికారులు తక్షణమే స్పందించాలి

విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. పోలీసు అధికారులు చోరీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో గస్తీ పెంచి రైతులకు ఆస్తి నష్టం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# 25వ ఏట అడుగుపెట్టిన శరన్నవరాత్రి ఉత్సవాలు

### - కరపత్రం ఆవిష్కరించిన సర్పంచ్, ఉప సర్పంచ్

**మల్లాపూర్, అక్టోబర్ 10, ప్రజా జ్యోతి** మండలంలోని కొత్త దాంరాజ్‌పల్లి గ్రామంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు శ్రీ నవదుర్గాదేవి సేవా సమితి సిద్ధమైంది. ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం గ్రామ ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 11న గ్రామ పొలిమేర నుంచి నవదుర్గాదేవి మండపం వరకు ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13న కుంకుమ పూజ, 14న చండీ హోమం, 15న బోనాల ఊరేగింపు, 16న దీపారాధన, 17న మహా అన్నదానం, 18న పల్లకి సేవ నిర్వహించనున్నారు. చివరి రోజైన 20న ఉదయం 9 గంటలకు గ్రామ బస్టాండ్ వద్ద మహిషాసుర సంహారం ఘట్టాన్ని ప్రదర్శించనున్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏగ్యారపు లింబాద్రి, ఉపసర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి, సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు






# బైక్ రేసింగ్ బరితెగింపు!

## వెనుక నుంచి ఎక్సెల్ కు ఢీ.. ఆపై ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన రేసింగ్ బైక్!

- ఇద్దరికి గాయాలు.. మైనర్ల ప్రమాదకర డ్రైవింగ్‌తో ప్రజల్లో ఆందోళన..
- రోడ్లపై వేగానికి అడ్డుకట్ట వేసేదెవరు?
- బైక్‌లతో విన్యాసాలు చేస్తూ రహదారులపై హల్‌చల్..
- మైనర్ల చేతుల్లో వాహనాలు పెట్టి తల్లిదండ్రులు ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారా?



**కోరుట్ల, అక్టోబర్ 10 ప్రజాజ్యోతి:**
కోరుట్ల పట్టణంలో మైనర్ల బైక్ రేసింగ్‌లు, ప్రమాదకర డ్రైవింగ్ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రహదారులపై విచ్చలవిడిగా వేగంతో దూసుకెళ్తూ, బైక్‌లతో విన్యాసాలు చేస్తున్న కొందరి నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఇతర వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తోంది. తాజాగా పట్టణంలోని వేములవాడ రోడ్డులో బీసీ కాలనీ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదం ఈ సమస్య తీవ్రతను మరోసారి గుర్తుచేసింది. అందిన సమాచారం ప్రకారం.. వేగంగా వెళ్తున్న ఓ రేసింగ్ బైక్ మొదట వెనుక నుంచి ఎక్సెల్ ను ఢీకొట్టింది. అనంతరం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ వరుస ఢీకొనడంతో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. ఈ ఘటనతో రహదారులపై బైక్‌లను ప్రమాదకరంగా నడపడం వల్ల ఇతరులకు ఎంతటి ముప్పు వాటిల్లుతుందనే విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

### మైనర్ల చేతుల్లో బైక్‌లు.. రహదారులపై ప్రాణసంకటం!

పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీల్లో కొందరు యువకులు, మైనర్లు అధిక వేగంతో బైక్‌లు నడుపుతూ హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలను వేగంగా నడపడమే కాకుండా, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయడం, రహదారులపై విన్యాసాలు చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీరి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో రోడ్డుపై నడిచే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తమ సరదా కోసం చేసే ప్రమాదకర విన్యాసాల వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు కలుగుతుందనే విషయాన్ని బైక్ నడిపేవారు గుర్తించాల్సిన అవసరం ఉంది. రహదారులు రేసింగ్ మైదానాలు కావని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని ప్రజలు సూచిస్తున్నారు.

### వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులదీ బాధ్యతే!

మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపుతున్న తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వాహనం నడిపే వయస్సు, డ్రైవింగ్ అర్హత, రహదారి భద్రత వంటి అంశాలను పట్టించుకోకుండా పిల్లలకు బైక్‌లు అప్పగించడం ప్రమాదాలకు దారితీయవచ్చు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు? ఎలా వాహనం నడుపుతున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ కలిగి ఉండాలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.

ఒక్క క్షణం సరదా కోసం చేసే నిర్లక్ష్యం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపే ప్రమాదం ఉందని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పోలీసుల నిఘా ఏది? చర్యలు ఎప్పుడు?

పట్టణంలో ప్రమాదకరంగా బైక్‌లు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, కాలనీల కూడళ్లు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, అధిక వేగంతో వాహనాలు నడిపేవారిని గుర్తించాలని సూచిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలు జరగకుండా ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని ప్రజలు పేర్కొంటున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలను నియంత్రించవచ్చని అభిప్రాయపడుతున్నారు.

### మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూడాలా?

కోరుట్లలో చోటుచేసుకున్న ఈ ఘటనతో బైక్ రేసింగ్‌లు, మైనర్ల ప్రమాదకర డ్రైవింగ్‌పై ఇప్పటికైనా కఠినమైన పర్యవేక్షణ అవసరమనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, తల్లిదండ్రులు, యువత సమన్వయంతో వ్యవహరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. వేగం ప్రదర్శించడానికి రోడ్లు కాదు.. సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడానికే రహదారులు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో తమ ప్రాణాలను మాత్రమే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టకూడదనే అవగాహన ప్రతి ఒక్కరిలో కలగాలి. మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, బైక్ రేసింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



